క్లుప్తంగా

పెరిగిన పింఛన్ల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు పెరిగిన పింఛన్లు మంగళవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ పంపిణీ చేశారు. అలాగే బీడి టేకేదార్లకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీకాంత్, సాయిలు, నర్సింలు, సిద్దారెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

పిట్లం(జుక్కల్): అన్నారంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం సర్పంచ్ కాశీరాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు..

దోమకొండ: ముత్యంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముత్తగారి శిరీష్ గౌడ్ మంగళవారం గ్రామానికి చెందిన పేద కుటుంబాలకు దుస్తులను పంపిణీ చేశారు. శిరీష్‌గౌడ్ తండ్రి సాయాగౌడ్ జ్ఞాపకార్థం సాయాగౌడ్ చారిటబుల్ ట్రస్టు తరపున 200 మంది మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులు అందజేసినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డి ఎంపీడీవోగా లక్ష్మి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎంపీడీవోగా లక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా రేగోడ్ నుంచి ఎల్లారెడ్డికి ఆమె బదిలీపై వచ్చారు. ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న రవీందర్ నుంచి ఆమె బాధ్యతలను తీసుకున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సర్పంచ్ సంజీవు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

కాంగ్రెస్ కమిటీల నియామకం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని దుర్గం, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, లొంక తండాలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు మోహన్ నాయక్ తెలిపారు.నాయకులు లైన్ రమేష్, మధార్, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కో–ఆర్డినేటర్లుగా..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్లుగా నీలం రవి, జీవన్‌లకు పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మంగళవారం నియామక పత్రాలను అందించారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్‌గా రవి, ఎల్లారెడ్డి మండల కో–ఆర్డినేటర్‌గా జీవన్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు. అలాగే దావల్‌మల్కపల్లి గ్రామంలో నివాసపు గుడిసె కాలిపోయిన బాధితురాలు పిట్ల సంగమణికి సుభాష్‌రెడ్డి నిత్యావసర వస్తువులను అందించారు.

డిగ్రీకళాశాలలో అడ్మిషన్లు తీసుకోండి

బాన్సువాడ రూరల్: ఇంటర్ పాసైన విద్యార్థులు సెప్టెంబర్ 4 లోపు అడ్మిషన్లు తీసుకోవాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ కోరారు. బీఏ, బీకామ్ కోర్సుల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంతో పాటు లైఫ్‌సైన్స్ తదితర విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో 459 మంది విద్యార్థులు చేరారని, ఇంకా 441సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

పక్షం రోజులకు చేరుకున్న ఏఎన్‌ఎంల సమ్మె



కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని చేపడుతున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సమ్మె మంగళవారానికి 15 రోజులకు చేరుకుంది. మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఎన్‌ఎంలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా తమను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న జుక్కల్

- ఎమ్మెల్యే హన్మంత్‌సింధే
- మద్నూర్‌లో మండల సర్వసభ్య సమావేశం



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే



బిచ్కుందలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): వెనకబడిన ప్రాంతంగా పేరున్న జుక్కల్ నియోజకవర్గం ప్రస్తుతం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లక్ష్మీబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2014 క్రితం జుక్కల్ నియోజకవర్గంలో ఉన్న పరిస్థితితులు ఇప్పుడు లేవని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అన్ని మండలాలు, గ్రామాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రోడ్లు ఇలా ప్రతి గ్రామంలో ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించామని చెప్పారు. ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు, విద్యుత్, సంక్షేమ ఫలాలు అందించడంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల కృషి అభినందనీయమని అన్నారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్పంచ్ సురేష్, మద్నూర్ విండో చైర్మన్ శీను పటేల్, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు చేరుతున్నాయని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మంగళవారం బిచ్కుందలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. దివ్యాంగులకు వెయ్యి రూపాయలు పెంచి పింఛన్ ఇస్తున్నామని, బీసీ, మైనార్టీలకు లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, తహసీల్దార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్, ఎంపీపీ శారద



గాంధారి మండల కేంద్రంలో..

దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీసీరోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఆర్టీసీ కార్పొరేషన్ ద్వారా రూ.29 లక్షలు మంజూరు కాగా మరమ్మతు పనులు, సీసీ రోడ్డు పనులు చేపట్టారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, తదితరులు పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గాంధారి మండల కేంద్రంలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో జెడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచ్ సంజీవు మంగళవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు పనులను నాణ్యతతో నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వైభవంగా కలశాల ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో రాజరాజేశ్వరి అమ్మవారి 7వ వార్షికోత్సం, పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పెద్ద ఎత్తున కలశాల ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని పాత హనుమాన్ ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రామారెడ్డి సాయిలు, కోశాధికారి ముదాం లక్ష్మీనారాయణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

అవి బీఆర్‌ఎస్ నేతలు చేసిన తీర్మానాలు

- జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామారెడ్డి: గ్రామ ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వార్డు మెంబర్లు, సర్పంచులు కుమ్మక్కై బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్‌కు ఏకగ్రీవంగా ఓటు వేస్తామని తీర్మానాలు చేస్తున్నారని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం అన్నారంలో 2 వందల బైకులతో కాంగ్రెస్ నేతలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా అన్నారం గ్రామంతో పాటు స్కూల్ తండా, బట్టు తండా, జగదంబ తండా, రమణ తండా గ్రామాలలో ప్రధాన చౌరస్తాల గుండా బైకులపై తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోహన్ రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్ మెప్పు పొందాలని ఉద్దేశంతో స్థానిక నాయకుడు ఇలా చేయడం ప్రజల ఓటు హక్కును హరించడమే అవుతుందని ఘాటుగా విమర్శించారు. పోసానిపేట సర్పంచు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల ముందస్తు అరెస్ట్



మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో మున్నూరు కాపులు



పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో..

మద్నూర్/పెద్దకొడప్‌గల్: హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరిన మున్నూరు కాపు కులస్తులను మద్నూర్, పెద్దకొడప్‌గల్ మండల కేంద్రాల్లో పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపులు మాట్లాడుతూ.. తమను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. రూ.5 వేల కోట్లతో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ బోర్డు నుంచి తొలగించి మున్నూరు కాపులకు అప్పగించాలన్నారు.

ప్రతి కుటుంబానికి కులవృత్తుల సాయం కింద రూ.5 లక్షలు కేటాయించాలన్నారు. భూములు లేని రైతులకు మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



రామారెడ్డి: మండల వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడ దినోత్సవంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(రెడ్డిపేట్)లో మంగళవారం ఉపాధ్యాయులు, క్రీడాకారులతో కలిసి 5కే రన్ నిర్వహించారు.

వైభవంగా ఓనమ్ వేడుకలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని కేరళ స్కూల్లో మంగళవారం ఓనమ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎదుట ముగ్గులు వేసి వాటిని రంగు రంగు పూలతో నింపారు. దీంతో పాటు విద్యార్థులకు చాక్లెట్లు, స్వీట్లను పంచిపెట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల జిమ్మీతోపాటు ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ



కామారెడ్డి రూరల్: లింగాయపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, సర్పంచ్ దేమే అపర్ణ రవి, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ వసతి గృహాలలో పని చేసే నాల్గవ తరగతి ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు వినతి పత్రం అందించారు. నేరుగా ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో కాశీరాం, రాములు, శంకర్, శ్రీహరి తదితరులున్నారు.

ఆర్థికాభివృద్ధికి సంఘాలు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కానుగంటి శారద

దోమకొండ: కుటుంబ జీవనోపాధులు పెంచి ఆర్థిక అభివృద్ధి సాధించడానికి మహిళా సంఘాలు కృషి చేయాలని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారదలు కోరారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య 16వ వార్షిక సమావేశం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సంఘాల ద్వారా రుణాలను అందజేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లావాదేవీలను సంఘం ప్రతినిధులు చదివి వినిపించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

అధ్యక్షురాలిగా లక్ష్మీ, ఉపాధ్యక్షురాలిగా అంజమ్మ, కార్యదర్శిగా విజయ, సహాయ కార్యదర్శిగా లత, కోశాధికారిగా స్వప్నలు ఎన్నికయ్యారు. డీపీఎంలు రమేష్‌బాబు, వకుల, ఏపీఎం రాజు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న రామకృష్ణ గుప్తా

కామారెడ్డి రూరల్: కల్కినగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ బీబీ పాటిల్‌ను సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తా ఆధ్వర్యంలో ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో ఎంపీ బీబీ పాటిల్ తన ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. ఈ నిధుల మంజూరు పత్రాన్ని సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వారు ఎంపీ బీబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త మండల ప్రకటనతో మిన్నంటిన సంబరాలు



ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు

నిజాంసాగర్ (జుక్కల్): తాతల కాలం నాటి కల సీఎం కేసీఆర్‌తో నెరవేరుతోందని, రాష్ట్ర ప్రభుత్వం మహమ్మద్‌నగర్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయడం పట్ల మంగళవారం జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు హర్షం వ్యక్తం చేశారు. మహమ్మద్‌నగర్‌లో ఆయన ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ, సంబరాలు నిర్వహించారు. అనంతరం గున్కుల్ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో ఆయన మాట్లాడారు. మండల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సర్పంచులు లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, సంగమేశ్వర్ గౌడ్, పున్న నారాయణ, చందర్ రాథోడ్ తదితరులున్నారు.

పార్కులకు స్పీకర్ పేరు పెట్టాలని కౌన్సిల్ తీర్మానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ జనరేషన్, చిల్డ్రన్ పార్కులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరును పెట్టాలని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అధ్యక్షతన సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ముందు 15 అంశాలను ప్రతిపాదించి తీర్మానించారు. పట్టణంలో ప్రతి ఇంటికి పూలమొక్కను అందజేయాలని, ప్రతి వార్డులో పార్కు నిర్మించేందుకు కృషి చేస్తామని చైర్మన్ అన్నారు. ఆదాయ ఖర్చుల వివరాలు చదివి వినిపించారు. తీర్మాణాలు చేసిన పత్రాలను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జుబేర్, కమిషనర్ రమేష్, సిబ్బంది తుల శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరు



ఎన్‌సీసీ యూనిట్ ఉత్తర్వులతో స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైందని ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరు గంగాధర్ తెలిపారు. ఎన్‌సీసీ బెటాలియన్ నిజామాబాద్ కల్నల్ కమాండింగ్ ఆఫీసర్ ద్వారా 54 క్యాడిటేస్‌తో 12(టీ) ఉత్తర్వులు మంజూరు అయ్యాయన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థిని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, చురుకుదనం, క్రీడాస్ఫూర్తి అలవడుతుందన్నారు. 2023–24 విద్యాసంవత్సరం నుంచే ఎన్‌సీసీ అమల్లోకి వస్తుందన్నారు. ఎన్‌సీసీలో చేరడం వల్ల భవిష్యత్తులో ఆర్మీ, పోలీసు నియామకాల్లో రిజర్వేషన్లు పొందవచ్చన్నారు. ప్రిన్సిపల్ గంగాధర్ మంగళవారం ఎన్‌సీసీ ఉత్తర్వులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ద్వారా అందుకుని కృతజ్ఞతలు తెలిపారు.

భగీరథ నీటిలో పుష్కలంగా లవణాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మిషన్ భగీరథ నీటిలో పుష్కలంగా లవణాలు ఉంటాయని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీరు రాంచంద్ నాయక్ అన్నారు. మంగళవారం మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గల మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద 102 మంది వీఆర్‌ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి ఇంటికి భగీరథ నీరు చేరేలా కృషి చేయాల్సిన బాధ్యత వీఆర్‌ఏలపై ఉందన్నారు. లీకేజీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏఈ శ్రీధర్ రెడ్డి, గ్రిడ్ అధికారులు పాల్గొన్నారు.

చెరువుకు మరమ్మతులు చేయడం లేదని నిరసన

రామారెడ్డి: మండల కేంద్రంలోని రంగా చెరువుకు గండి పడిన విషయాన్ని జిల్లా సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రామారెడ్డి జెడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు రంగా చెరువు దగ్గర వంటా వార్పు నిర్వహించి, నిరసన తెలిపారు. గండిని పూడ్చేందుకు తట్టా, పార పట్టుకొని కాంగ్రెస్ నాయకులు నిరసనకు దిగారు. స్పందించిన ఇరిగేషన్ అధికారులు వెంటనే ప్రొక్లెయిన్ పంపి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

భారీ మెజార్టీతో గెలిపిస్తామని తీర్మానాలు

భిక్కనూరు/మాచారెడ్డి: కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెబుతూ..మాచారెడ్డి, భిక్కనూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, గ్రామస్తులు మంగళవారం ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు తీర్మాన ప్రతులను స్థానిక నాయకులకు అందజేశారు.

సంక్షిప్తం

కాంగ్రెస్ ఓబీసీ మండల ఉపాధ్యక్షుడిగా రాజేందర్

భిక్కనూరు: కాంగ్రెస్ మండల ఓబీసీ ఉపాధ్యక్షునిగా బత్తిని రాజేందర్‌ను, రామేశ్వర్‌పల్లి ఓబీసీ అధ్యక్షుడిగా తేలు ధర్మస్వామిని నియమించారు. ఈ మేరకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, వారికి మంగళవారం నియమాకపత్రం అందజేశారు. ఓబీసీ మండల అధ్యక్షుడు వడ్ల తిర్మల్‌స్వామి పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ ఎన్నిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వజ్జపల్లి తండాకు చెందిన మాలోత్ విజయ్‌కుమార్ నంగార భేరి లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిగా గణేశ్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాలోత్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బంజార జాతి ఔన్నత్యం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు.

మాచారెడ్డి ఎంపీపీకి సన్మానం..

మాచారెడ్డి: గౌరవ డాక్టరేట్ పొందిన మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావుకు మంగళవారం జానపద కళాకారుడు అయిండ్ల రాముతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మినుకూరి రామ్ రెడ్డి, జీడిపల్లి నరసింహారెడ్డి, తదితరులున్నారు.

సిద్ధరామేశ్వరాలయంలో అదనపు కలెక్టర్ పూజలు

భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ మంగళవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ దంపతులను సన్మానించారు.

ముగిసిన పీజీ సెమిస్టర్ పరీక్షలు

భిక్కనూరు: సౌత్ క్యాంపస్‌లో పీజీ సెమిస్టర్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మంగళవారం 63 మంది విద్యార్థులకు గాను 62 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ప్రిన్సిపాల్ కవితా తోరస్ పరిశీలించారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన స్వామీజీ

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామంలోని ఆది బసవేశ్వర ఆలయ పీఠాధిపతి సద్గురు సోమాయప్ప స్వామీజీ మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. శ్రావణ మాస ముగింపు ఉత్సవాలు సెప్టెంబర్ 11న నిర్వహిస్తున్నామని, ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని కోరగా స్పీకర్ సానుకూలంగా స్పందించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ స్పీకర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు.

65వ రోజుకు చేరిన స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 65వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.27 వేల వేతనం చెల్లించాలన్నారు. చనిపోయిన స్వీపర్స్ స్థానంలో వారి వారసులను నియమించాలని కోరారు.

సౌత్‌క్యాంపస్‌లో హరితహారం

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో జియో ఇన్ఫర్‌మాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చంద్రయాన్–3 విజయవంతం అవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కవితా తోరస్, అక్తర్ అలీ, సుధాకర్‌గౌడ్, నారాయణ గుప్తా పాల్గొన్నారు.